# పార్శ్వం

**మిర్రర్**

ఆదివారం.

అయినా ఉదయం అయిదు కాకుండానే నిద్ర మెలకువ వచ్చింది. అసలు ఇంత పేకువనే నిద్ర లేవటం నా అలవాట్లలో ఒకటికాదు.

అయితే ప్రతి విషయానికి ఏదో ఒక మినహాయింపు వుంటుంది. అదే ఇక్కడ కూడా వర్తిస్తుంది.

పిల్లలకు వేసవి సెలవులు ఇవ్వటంతో శ్రీమతి పుట్టింటికి వెళ్ళింది. అదేమిటో కానీ, ఆవిడ ఎక్కిన రైలు కదలటం ఆలస్యం, నాలో ఎక్కడ లేని హుషారు బయలు దేరుతుంది. ఉదయం లేచింది మొదలు మనసు ఉత్సాహంతో గంతులు వేస్తుంది. ఇంకా స్పష్టంగా చెప్పాలంటె ఆవిడ పుట్టింటికి వెళ్ళగానే నాకు నేను జైలునుంచి తప్పించుకున్న ఖైదీలా ఫీలు అవుతూవుంటాను.

దీప ముండగానే ఇల్లు చక్కబెట్టుకోవాలన్నట్టుగా, ఆవిడ తిరిగి రాకముందే "విందులూ-మందులూ" ఏర్పాటుచేసుకోవాలి. ఆ తరువాత మంచి బాలుడు (లేక భర్త) పాత్ర ఎలాగూ ధరించక తప్పదు.

ఈ రోజు ఎలా గడపాలా అని ఆలోచిస్తుండగా విశ్వప్రసాద్ తన గృహ ప్రవేశానికి ఆహ్వానించిన విషయం గుర్తు వచ్చింది.

లేచి డైరీలో వుంచిన ఇన్విటేషన్ కార్డు తీసి చూసాను. ముహూర్తం తెల్లవారుఝామున మూడున్నరకి. అంటె ఈ పరికి గృహ ప్రవేశం అయిపోయిందన్నమాట.

అంతా అయిం తరువాత వెళ్తే బాగుంటుందా? ఏమో! పోనీ వెళ్ళకుండావుంటేనో?

వెళ్ళకపోతే చలపతికి కోపం వస్తుంది.

చలపతి నాకు మంచి (మందు) మిత్రుడు. కనీసం అతని తృప్తికోసమైనా వెళ్ళక తప్పదు.

ఆ మాటకొస్తే అసలు విశ్వ ప్రసాద్‌తో నాకంత స్నేహం లేదు. అతను చలపతి కోసం వస్తూ వుండేవాడు. చలపతి నా కొలీగ్. అతను సీటులో లేని సమయంలో విశ్వప్రసాద్ గనగ వస్తే, ఎటెండ్ చేయటం తప్ప, అంతకు మించిన పరిచయం లేదు.

విశ్వప్రసాద్ చలపతికి బావమరిది.

అయితే ఈ కాస్త పరిచయంలో తెలుసుకున్న దేమంటే విశ్వప్రసాద్ మహా భోళా మనిషి. సహృదయుడు. మనసువిప్పి మాట్లాడుతాడు. మంచి స్నేహ పాత్రుడు. అయినా సందర్భం రాలేదు కనక ఇంతవరకూ విశ్వ ప్రసాద్‌తో సన్నిహితబంధం ఏర్పడలేదు.

ఆ కాస్త పరిచయాన్ని పురస్కరించుకుని విశ్వ ప్రసాద్ నాకు ఇన్విటేషన్ కార్డు ఇవ్వటం జరిగింది. అంతేకాక చలపతి కూడ స్వయంగా నన్ను ఆహ్వానించాడు.

ముహూర్తం ఎలాగూ దాటిపోయింది. కాబట్టి కాస్త ఆలస్యంగా వెళ్ళినా ఫరవాలేదు అనుకున్నాను.

అన్ని పనులూ ముగించుకుని రోడ్డున పడే సరికి తొమ్మిది దాటింది. అప్పుడే తెరుస్తున్న ఓ షాపులో జొరబడి, ప్రజంటేషనుగా వుడ్ పీసు మీద వేసిన ఓ పెయింటింగ్ కొనుక్కుని బయలు దేరాను.

దిల్‌సుక్‌నగర్ బస్‌డిపో ఎదురుగా అనేక కొత్త కాలనీలు వెలిసాయి. అన్నీ కొత్తగా కట్టిన ఇళ్ళే. కాలనీ ప్రారంభదశలో వున్నందువల్ల ఇంకా ఇంటి నంబర్లు, వీధి పేర్లు ఏర్పడ లేదు. ఆ కాలనీలో విశ్వప్రసాద్ ఇల్లు తెలుసుకునే సరికి అరగంట పట్టింది. అన్ని ఇళ్ళూ ఒకే దశలో వుండటంవల్ల గుర్తులు తెలియ లేదు.


అసలే మండు వేసవి కావటంవల్ల, గొంతు ఎండిపోయింది. వళ్ళు చెమటలు పట్టేసింది.

ఇంటి ముందు పెద్ద షామియానా ఎన్నో కుర్చీలు, ఎన్నో బల్లలు ఎరేంజిచేసివున్నాయి. ఇల్లంతా బంధుమిత్రులతో ఎంతో హడావిడిగా వుంది. అయినా నాకు తెలిసిన వ్యక్తి ఒక్కరూ కనపడలేదు.

నన్ను గుర్తించగల వ్యక్తి విశ్వప్రసాద్ ఒక్కడే. అతను పట్టు వస్త్రం ధరించి పతీ సమేతంగా అవతలిగదిలో సత్యనారాయణ వ్రతం చేస్తున్నాడు. అతనికి నేను కనపడే అవకాశం లేదు.

చలపతి ఏ పనిమీద తిరుగుతున్నాడో అసలు జాడలేదు.

> అంతా కలిసి ఆమెను తమ స్వార్థానికి వాడుకుంటున్నట్లుగా అనిపించింది ఎదుటి వ్యక్తిని తమ అవసరానికి నిర్దయగా వాడుకునే రాక్షసులనిపించారు వాళ్ళు. ఆ క్షణంలో ఆమె మూర్తీభవించిన శోకదేవతలా, పాపభారాన్ని మోస్తున్న భూదేవిలా కనిపించింది



ఏం చేయాలా అన్న మీమాంసలో వుండగా, ఓ అపరిచిత వ్యక్తి నన్ను సాదరంగా ఆహ్వానించి ఓ కుర్చీ చూపించాడు.

మరుక్షణం ఓ బాలుడు చల్లటి మంచినీళ్ళు అందించాడు. నీళ్ళు తాగి సేద తీర్చుకుంటూ వుండగా మరెవరో కాఫీ గ్లాసు తెచ్చి నాముందు వుంచారు.

నెమ్మదిగా కాఫీ తాగుతూ పరిసరాలు గమనించ సాగాను.

విశ్వప్రసాద్ అదృష్టవంతుడు అనిపించింది. ఇంత చిన్న వయసులోనే ఇల్లు కట్టించ గలిగాడు మరి మనిషి పైకి సాధారణంగా కనిపించినా, జీవితపువిలువలు తెలిసిన వ్యక్తి అనిపిస్తుంది.

ఇల్లు ఇంకా కొత్త వాసన వేస్తూంది. ఆ వాసనలో ఓ కమ్మదనం వుంది. ఓ ఆప్యాయత వుంది. అంతకంటె ఏదో ఆత్మీయతవుంది. ఇంటికి కట్టిన మామిడాకు తోరణాలు, కొబ్బరి మట్టలు, లోపలనుంచి వస్తున్న అగరు వత్తుల పరిమళం అంతా కలిసి వాతావరణాన్ని మనోజ్ఞం చేస్తున్నాయి.

అన్నీ కలిపి ఆరు గదులు వున్నట్టున్నాయి. ముందు భాగం స్పష్టంగా అగుపిస్తూంది. ఇంటి ముందు నుయ్యి. నూతికి మోటారు. ఇంటితలుపుల పనితనం, ఇంటిప్లాను చూస్తుంటే, విశ్వప్రసాద్ చక్కటి అభిరుచులు గల మనిషి అనిపిస్తూంది.

ఇంటికి అటు ప్రక్కన కొంత ఖాళీవుంది. ఆ ఖాళీ ప్రదేశంలో వంటలు.

అప్పటికే నేను వచ్చి అరగంట అయింది.

క్రమంగా నాకు ఒంటరితనం ఏర్పడసాగింది.

ఎంతో మంది ఆడమగ కోలాహలంగా అటూ ఇటూ తిరుగుతున్నారు. ఎవరు ఎవరో. ఏమిటో అంతా అయోమయంగా వుంది.

అంత మంది వున్నా నన్ను పలకరించిన నాథుడు లేడు. నాకు నేనుగా ఎవరితో ఏం మాట్లాడాలో తెలియటంలేదు.

చలపతి వస్తే బాగుండును అనిపించింది. కానీ అతని జాడలేదు.

లోపలినుంచి పురోహితులవారి మంత్రఘోష మహాజోరుగా వినపడుతూంది. అంటే పేజాకూడా ఎక్కువే అనుకోవాలి.

విశ్వప్రసాద్ లేచివస్తే నేనుతెచ్చిన ప్రజెంటేషను ఇచ్చి వెళ్ళిపోవాలనివుంది. కానీ ఈ వ్రతం ఇప్పట్లో అయ్యేలా లేదు. పరిస్థితి ఇలా వుంటుందని వూహిస్తే తోడుగా ఏ పుస్తకమో, ఏ నవలో తెచ్చుకుని వుండే వాడిని.

తెలిసీ తెలియని వారి ఇంటికి అతిధిగా వెళ్ళటంలో వచ్చే ఇబ్బందులు అనుభవపూర్వకంగా తెలిసాయి.

ఏది ఏమైనా ఈ పరిస్థితినుంచి తప్పించుకోగల మార్గం కనపడటంలేదు. ఎవరోవచ్చినా ఒంటరితనం పోగొట్టాలను కోవటం కంటె నాకు నేనే ఈ జన సందోహంలో కలసి పోవటం మంచిదిగా తోచింది.

ఎదురుగా షామియానా నిలువు కర్రలను పట్టుకుని పైకి ఎగబాకుతున్న ఓ బాలుడిని వారించబోయాను. ఆ బాలుడు నిర్లక్ష్యంగా నా వైపొకసారి చూసి మరుక్షణం తన ప్రయత్నం కొనసాగిస్తూ మరింత పైకి ఎగబాకసాగాడు.

క్షణకాలం నివ్వెరపోయినా, ఆ బాలుడి స్వేచ్ఛను అరికట్టబోయిన నా పెద్దరికపు తెలివి తక్కువ తనానికి సిగుపడ్డాను.

అంత దూరంలో. ఆ ఇంటి ప్రాంగణపు ఖాళీలో వంటలు జోరుగా సాగుతున్నాయి. ఆ సువాసనలు గాలిలో ఎగిరి నాకు సోకటంతో, నాలో ఆకలిమంట ఒక్కసారిగా పైకి ఎగబ్రాకింది. అప్పుడుగానీ ఉదయంనుంచీ ఏమీ తిండి పడలేదన్న విషయం గుర్తు రాలేదు.

వెంటనే ఎవరైనా తెచ్చి ఇంత టిఫిను పెడితే బాగుండుననుకున్నాను. కానీ ఎవరిని అడగటం, ఏమని అడగటం?

ఎదురుగా వండుతున్న వంటకాలు కళ్ళ ముందు మెదులుతున్నాయి. ఇంకా ఏవో ఆహార పదార్థాలు తయారు అవుతున్నాయి. అన్నీ అందుబాటులోనేవున్నాయి. కానీ అందుకోలేని పరిస్థితి.

నెమ్మదిగా ఓ బాలుడిని మంచి చేసుకుని ఏదైనా తెప్పించుకుందామనిపించింది. కానీ ఇందాక నిర్లక్ష్యంగా చూసిన ఆ బాలుడిచూపులు కళ్ళముందు మెదిలి, మెదలకుండా వుండి పోయాను.

ఏది ఏమైనా ఆకలిమంట అధికంకావటంతో నా ప్రమేయంలేకుండానే కాళ్ళు ఆ వంటవండే చోటికి దారితీసాయి.

రెండు పొయ్యిలమీద ఏవో వుడుకుతున్నాయి. వాటిముందు కూర్చుని ఓ స్త్రీ వంట కాలను పర్యవేక్షిస్తూంది. ఆమె ముఖం నాకు కనపడటంలేదు. వయసు యాభై సంవత్సరాలు వుంటుంది.

అసలే పొయ్యి మంటలకు వేడి. అంతే కాక పైన ఆచ్ఛాదన లేక పోవటంతో మండు టెండ దానికితోడై అక్కడ సెగలు పొగలుగా వుంది.

ఇంతసేపూ నీడపట్టున వున్న నాకు ఆ ఎండ వేడిమి, ఆ పొయ్యిసెగ ఎంత తీవ్రంగా వుందో అర్థం కాలేదు.

అయితే అంతటి దుర్భరమైన స్థితిలో ఆమె వంటవండుతూందంటే, ఆమె పరిస్థితి ఎంత దయనీయమైందో కదా అనిపించింది.

ఇంత పెద్ద ఇల్లు కట్టింది, ఇంత పెద్ద షామియానా వేయించగలిగిన వాళ్ళు వంటవండేందుకు కాస్త షెల్టర్ ఎందుకు వేయించలేదు. కేవలం నిర్లక్ష్యమా లేక షామియానా కింద వంటలు చేయటం ప్రమాదం అని ముందు జాగ్రత్తనా. ఏది ఏమైనా అందరి కోసం ఆమె అలా అమానుషంగా కష్టపడటం నాకు సహింపరానిదిగా తోచింది.



## హీరోలు

కొత్తగా విడుదలైన సినిమా మార్నింగ్ షో చూసి వస్తున్నాడు సుబ్బారావు.

"ఎలా వుంది సినిమా!" అడిగాడు సుందరం.

"రెండు తలనొప్పి మాత్రలు వేసుకోవాలి" అన్నాడు సుబ్బారావు

"రెండు ఎందుకయ్యా!" కోపంగా అడిగాడు సుందరం.

"ఇద్దరు హీరోలున్నారుగనక" అవేసి వెళ్ళిపోయాడు సుబ్బారావు.

—వై. పాండురంగం (లక్ష్మీనారాయణపురం)

అంతాకలిసి ఆమెను తమ స్వార్థానికి వాడుకుంటున్నట్టుగా అనిపించింది. ఎదుటి వ్యక్తిని తమ అవసరానికి నిర్దయగా వాడుకునే రాక్షసులనిపించారు వాళ్ళు. ఆ క్షణంలో ఆమె మూర్తీభవించిన శోకదేవతలా, పాపభారాన్ని మోస్తున్న భూదేవిలా కనిపించింది.

ఇంతలో చలపతి ఎప్పుడు వచ్చాడో ఏమో-

"సారథీ! నువ్వు వచ్చి ఎంతసేపు అయింది" అంటూ భుజంమీద తట్టాడు చలపతి.

అలికిడి కావటంతో ఆమె వెనుతిరిగి మా వంక చూసింది.

ఆమె చేతులు జీవంలేని ఎండు కట్టెలులాగా వున్నాయి. ఆమె శరీరం పొయ్యిలో కాలిపోయిన బొగ్గుల్లా నల్లగావుంది. ఆమెమొహంలో స్వేద బిందువులు ధారలుగా కారుతూ యజ్ఞానికి బలిచేయబడ్డ పశువు శరీరంనుంచి కారే రక్తపు ధారలులాగా వున్నాయి.


ఆమె ఆ క్షణంలో కాలుతున్న శవాన్ని పర్యవేక్షించే శ్మశాన కాపరిలా నిర్వికారంగా వుంది.

"సత్యనారాయణ స్వామివారి కథ చదువుతున్నారు. అక్కడికి వెళ్దాము పద" అంటూ చలపతి నన్ను పూజలు జరుగుతున్న గదిలోకి ప్రవేశింపచేసాడు.

విశ్వప్రసాద్ నన్ను గమనించినట్లుగా కళ్ళతోనే పలకరించాడు. ప్రతిగా నేను చిరునవ్వు నవ్వాను.

స్వామి వారికథ కొనసాగుతుంది.

ఆశ్చర్యం —నేరేళ్ళ కృష్ణమూర్తి





ఎకానమీ

జోకులరావు ఓ జోకు రాశాడు. 'ఈ ప్రశ్నకి బదులేది?'కి ఒక జవాబు కూడా రాశాడు. ఓ పోస్టు కార్డుమీద జవాబు రాసి, 'ఎకానమీ' అని చెప్పి జోకుతోపాటు పోస్టు కార్డుని కూడా ఓ కవర్‌లో పెట్టి పోస్టుచేశాడు.

—డి. శివరాజ్ (హైద్రాబాద్)

ఆహూతులందరూ భక్తితో వింటున్నారు.

నేను మవునంగా మనుషులను గమనించ సాగాను.

విశ్వప్రసాద్ ప్రక్కన ఆయన శ్రీమతి పట్టుచీర ధరించి భక్తితో స్వామివారి పూజ చేస్తూంది.

ఆ ప్రక్కన విశ్వప్రసాద్ తల్లిదండ్రులు కూడా కూర్చుని వున్నారు. విశ్వప్రసాద్ తండ్రికి అరవై ఏళ్ళుంటాయి. అయినా ఆరోగ్యంగా ఆనందంగా వున్నారు. విశ్వప్రసాద్ తల్లి పండు ముత్తయిదువులా అందరినీ కాపాడే ఆదిశక్తిలా నిండుగా గంభీరంగా వున్నారు. ఆ వృద్ధ దంపతులు ఇద్దరూ ప్రక్క ప్రక్కన కూర్చునివుంటే హిమగిరిపై వెలసిన ఆది దంపతులవలె వున్నారు.

వారిని చూసింతరువాత నాకు క్షణకాలం మనసు తన్మయత్వం చెందింది.

వెంటనే లేచి వారిరువురి పాదాలు తాకి వారి ఆశీర్వాదం పొందాలన్నంత ఉద్వేగం కలిగింది. కానీ ఎలాగో మనసు నిలదొక్కుకున్నాను.

నా కంటే విశ్వప్రసాద్ ఎంతో అదృష్టవంతుడు. అతనికింకా తల్లీతండ్రీ వున్నారు. అతని వయస్కుడనే అయినా నేను నా తలిదండ్రులను కోల్పోయి ఎంతో కాలం అయింది. మనిషికి తల్లి తండ్రులు లేకపోవటం కంటె పెద్దలోపం మరొకటి వుండబోదు.

విశ్వప్రసాద్ ఎంత అదృష్టవంతుడో అతని తల్లిదండ్రులు కూడా అంతే అదృష్టవంతులు.

కొడుకులు పెరిగిపెద్ద వాళ్ళు అయి జీవితంలో యోగ్యులుగా మారి, సమాజంలో చక్కటి స్థానం సంపాదించుకుని పదిమందిలో మంచిగా మనగలిగివుండటం ఎవరికి మాత్రం ఆనందదాయకం కాదు.

అంతటి అదృష్టానికి నోచుకున్న ఆ వృద్ధ దంపతులు గతంలో ఎంతో పుణ్యం చేసుకుని వుండాలి అనిపించింది. కాబట్టే ఈవయసులో కూడా ఇంత చక్కటి ఆరోగ్యం, ఇంతటి వైభోగంతో జీవితం కొనసాగించగలుగుతున్నారు.

ఆసమయంలో నేను దైవసన్నిధిలో పొందే ఆత్మానందం పొందాను. ఆ వృద్ధ దంపతులను చూసింతరువాత నాకూ తల్లిదండ్రులు లేరనే భావం మరిచిపోయాను.

కథ ముగిసింది. ప్రసాదం పంచిపెట్టారు.

నేను తెచ్చిన ప్రజెంటేషను అందించాను.

క్రమంగా అతిథులు తిరుగుముఖంపట్టారు.

నేనుకూడా బయలుదేరబోయాను.

కానీ విశ్వప్రసాద్ వెళ్ళనీయలేదు. భోజనం చేసి వెళ్ళవలసిందిగా కోరాడు.

ఆ మంచి మనుషుల మధ్యనుంచి నాకూ వెళ్ళాలనిపించలేదు.

భోజనాలు వడ్డించారు.

ఎన్నో పదార్థాలు

ఎన్నో వంటకాలు.

ఎన్నో రుచులు.

ఎన్నో సువాసనలు.

విస్తరిముందు కూర్చున్న నాకు క్షణకాలం ఆ వంటమనిషి ముఖం నా కళ్ళముందు మెదిలింది.

వెంటనే మనసు వికలం అయిపోయింది.

వడ్డించిన ప్రతివంటకంలోనూ ఆమె శ్రమ వుంది.

ఆమె రెక్కలు ముక్కలు చేసుకుని, మండుటెండలో కష్టపడి వంటలు చేసినందుకు ఆమెకు ఎంత ప్రతిఫలం ముట్టుతుందో ఏమో!

కష్టం ఆమెది.

సుఖం ఇంకొకరిది.

ఏమిటి ఈ దోపిడీ?

ఏమిటి ఈ అన్యాయం?

దీనికి బాధ్యులెవరు?

దీనికి అంతం లేదా?

ఏమిటో! మనసు పరిపరి విధాలపోయింది.

ఇలా సాటి మానవుడ్ని స్వార్థం కోసం బలిచేస్తున్న వారిలో నేను వున్నాననిపించి, నా నోటికి అన్నం సహించలేదు.

భోజనాల కార్యక్రమం ముగిసింది.

ఆ తరువాత విశ్వప్రసాద్ తన కుటుంబంలోని వారినందరినీ నాకు పరిచయం చేసాడు.

వాళ్ళు ఆరుగురు అన్నదమ్ములు. ముగ్గురు అక్కచెల్లెళ్లు.

అన్నదమ్ములు అంతా, బ్యాంకులు, రైల్వే కాలేజీ లెక్చరరు లాంటి వుద్యోగాలు చేస్తూ వివిధ పట్టణాలలో వుంటున్నారు. ఆడపిల్లల పెళ్ళిళ్ళు అయిపోయాయి.

ఆ వృద్ధ దంపతులు మాత్రం కొడుకులవద్ద అక్కడ కొన్నాళ్ళు, అక్కడ కొన్నాళ్ళు వుంటున్నారు.

అందరూ నాకు పేరుపేరునా పరిచయం చెయ్యబడ్డారు.

నేను అక్షరాలా విశ్వప్రసాద్ తల్లిదండ్రుల పాదాలుతాకి వారి ఆశీర్వాదం పొందాను.

నేను బయలుదేరబోతుండగా—

"అన్నట్లు మరిచాను. ఈమె మా పిన్ని గారు. మా అమ్మగారికి చెల్లెలు. చిన్నప్పుడే భర్తపోయారు. పిల్లలు లేరు" అంటూ విశ్వప్రసాద్—ఆ వంటచేసిన స్త్రీని నాకు పరిచయం చేసాడు. ఆమె నిర్వికారంగా చూస్తూవుండిపోయింది.

నేను కొయ్యబారిపోయాను.

ఏమిటిది? ఎంతతేడా?

ఇద్దరు అక్కచెల్లెళ్ళ మధ్య జీవితంలో ఇంత పెద్ద తేడానా. ఆమె అంత వైభోగంలో వుంటే ఈమె ఇంత దురవస్థలో వుండటానికి కారణం ఏమిటి?

దీన్నే విధి అంటారేమో?

ఆమెను ఎవరో వంచిస్తున్నారని ఇంతవరకూ అనుకున్నాను, కానీ ఆమెను విధే వంచించింది.

కొందరిపట్ల విధి అనేది మనిషికంటె క్రూరమైంది అనిపించింది. ✻


నరముల బలహీనత, గుప్త రోగములకు
ఉత్తమ చికిత్స!
పెండ్లి ముందు, పెండ్లి తర్వాత



సంప్రదించండి:
**Dr. Z. H. ROY**
**(Govt. Regd.)**
**ఆసియా క్లినిక్**
ఆర్.టి.సి. క్రాస్‌రోడ్,
సంధ్య టాకీస్ ఎదుట,
హైద్రాబాద్—500020
కృష్ణాటాకీస్ వద్ద, కడప—1
Dr. K. Kesava Rao (Govt. Regd)